ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 13 ఆగస్టు 2025

నేటి నుంచి వేడుకలు..

శ్రీకాకుళం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో జిల్లా ఆవిర్భావ వజ్రోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు జరగనున్న ఈ వేడుకలకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.


- 13న ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఉదయం 7 గంటలకు రన్ ఫర్ శ్రీకాకుళం ర్యాలీ ప్రారంభిస్తారు. నాగావళి హోటల్‌లో ఉదయం 11 గంటలకు పెట్టుబడిదారులతో సమావేశం నిర్వహిస్తారు. కేఆర్ స్టేడియంలో మూడురోజుల పాటు సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు స్వర్ణ శ్రీకాకుళం ఫెయిర్ అండ్ ఎగ్జిబిషన్ ప్రదర్శిస్తారు.
- 14న ఏడురోడ్ల జంక్షన్‌లోని మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్రీడా పోటీలు నిర్వహిస్తారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం పోటీలు ఉంటాయి.
- 15న ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు కేఆర్ స్టేడియంలో జిల్లాకు చెందిన ప్రముఖలను సన్మానిస్తారు. ఈ వేడుకల్లో కేంద్ర, రాష్ట్ర మంత్రులు, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనున్నారు.

సిక్కోలు వజ్రోత్సవం

- ప్రతి అడుగులోనూ చైతన్యమే
- పోరాటాలకు దిక్సూచి శ్రీకాకుళం
- స్వాతంత్ర్య ఉద్యమంలోనూ కీలకం
- రాజకీయంగా తనదైన ముద్ర

సిక్కోలు.. ఎన్నో ఉద్యమాలకు స్ఫూర్తి రగిల్చిన పోరాటాల పురిటిగెడ్డ. స్వాతంత్ర్య ఉద్యమంలో ఈ ప్రాంతం కీలకపాత్ర పోషించింది. గిరిజన రైతాంగ పోరాటంతో జాతీయస్థాయిలో కూడా ఉద్యమాల కేంద్రంగా గుర్తింపు పొందింది. మరోవైపు పచ్చని పంట పొలాలు, ప్రకృతి అందాలు, ఉప్పొంగే భక్తిభావం, విజ్ఞాన వికాసం సిక్కోలు సొంతం. ఎన్నో ఆటంకాలను అధిగమిస్తూ.. 75 ఏళ్ల కిందట ఇదేరోజు జిల్లాగా అవతరించిన శ్రీకాకుళం.. నేడు వజ్రోత్సవాలకు ముస్తాబైంది. బుధవారం నుంచి మూడురోజులపాటు వేడుకలు నిర్వహించేందుకు యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈ నేపథ్యంలో జిల్లా ఆవిర్భావం, చరిత్ర, ప్రగతి గురించి కథనాలు..

రణస్థలం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం అంటేనే అన్ని ప్రాంతాల సమాహారం. 193 కిలోమీటర్ల సుదీర్ఘమైన తీరప్రాంతం.. రూ.కోట్లలో విలువచేసే ఖనిజ సంపద.. పచ్చని కొండలు.. సుదూరమైన జాతీయరహదారి.. ఇవన్నీ జిల్లాకు ఆభరణాలు. మరోవైపు పర్యాటక అందాలకు నెలవు సిక్కోలు. ఇంకోవైపు అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలు పరిడవిల్లుతున్నాయి. శాలిహుండం, దంతపురి, పాండవుల మెట్ట, జగతిమెట్ట వంటి పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. వంశధార, నాగావళి, బాహుదా, మహేంద్ర తనయా వంటి నదులు ప్రవహించే నేల ఇది. ఉద్యమాలకు పుట్టినిల్లుగా పేరొందింది. స్వాతంత్ర సమరయోధులు, రాజకీయ వేత్తలు, రంగస్థల కళాకారులు వంటి ఎందరో ప్రముఖులు జన్మించిన పుణ్యస్థలం. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న సిక్కోలు ఏడున్నర దశాబ్దాలుగా ఒడిదొడుకులను ఎదుర్కొంటూ.. అభివృద్ధి దిశగా పయనిస్తోంది.



జిల్లా ఆవిర్భావం ఇలా..

శ్రీకాకుళం జిల్లా 1950 ఆగస్టు 15న ఆవిర్భవించింది. అప్పటివరకూ ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌గా ఉండేది. తర్వాత 11 తాలుకాలు, 3 రెవెన్యూ డివిజన్లు, 18 అసెంబ్లీ నియోజకవర్గాలతో శ్రీకాకుళం జిల్లా ఏర్పడింది. 1960లో ప్రస్తుత జిల్లా పరిషత్‌గా పిలిచే జిల్లా బోర్డు ఏర్పాటైంది. 1969లో జిల్లా విభజన జరిగింది. బొబ్బిలి, సాలూరు తాలుకాల్లోని 107 గ్రామాలను (మిగతా 6వ పేజీలో..)



అప్పట్లో చికాకోల్

నరసన్నపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళాన్ని అప్పట్లో చికాకోల్ అని పిలిచేవారు. ఆ పేరును క్రమేపీ సిక్కోలుగా పలికేవారు. తూర్పు గంగరాజువంశం, నందపూర్ సూర్యవంశీయలు, గోల్కొండ కుతుబ్‌షాహీలు పాలించినట్టు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. క్రీ.పూ. ఆరో శతాబ్దంలో ఆవిర్భవించిన బౌద్ధమతం.. శ్రీకాకుళంలో బాగా విస్తరించింది. ఆనాటి బౌద్ధ ఆరామాలే నేటి శాలిహుండం, దంతపురి తదితర ప్రాంతాల్లో ఉన్నాయి. తూర్పు కనుములు ప్రకృతి సోయగాలకు ప్రతీకగా నిలిచాయి. మందస, మెళియాపుట్టి, పాతపట్నం, సారవకోట, హిరమండలం, కొత్తూరు. సరుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట తదితర మండలాల్లో తూర్పుకనుమలు విస్తరించి ఉన్నాయి.

- జిల్లాలో బీల ప్రాంతం, ఉద్దానం.. ఒండ్రు నేలలతో కూడి సారవంతమైన భూములు ఉన్నాయి. ఈ ప్రాంతంలో పలు ఆహార, వాణిజ్య పంటలు సమృద్ధిగా పండుతాయి. ఉద్దానం కొబ్బరి, జీడిమామిడి, పనస, ములగ, మైదానం ప్రాంతంలో వరి, అపరాలు, వేరుశెనగ, మొక్కజొన్న వంటి పంటలు పుష్కలంగా పండుతాయి. జిల్లాలో ఏటా సుమారు 5.5 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తారు.

సాహితీవేత్తలెందరో..

జిల్లాకు చెందిన పలువురు సాహితీవేత్తలుగా గుర్తింపు పొందారు. వ్యవహారిక భాష పితామహుడు - గిడుగు రామమూర్తి పంతులు, కవి, స్వాతంత్ర సమరయోధుడు - గరిమెళ్ల సత్యనారాయణ, కథారచయిత - కాళీపట్నం రామారావు, నాటక రచయిత, కవి, కథకులు, కేంద్రసంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత దీర్ఘాశి విజయభాస్కర్, సాహితీవేత్త, రచయిత - రాచకొండ విశ్వనాథశాస్త్రి, రచయితలు - పింగళి నాగేంద్రరావు, వాండ్రంగి రామారావు, అట్టాడ అప్పలనాయుడు, బలివాడ కాంతారావు, సాహితీ పరిశోధకులు ఛాయరాజ్, దూసి ధర్మారావు తదితరులు జిల్లాకు చెందిన వారే. శ్రీపాద పినాకపాణి, వడ్డాది పాపయ్య, జె.వి.సోమయాజులు, చట్టి పూర్ణయ్య పంతులు, అమరాపు సత్యనారాయణ, యడ్ల గోపాలరావు, దూసి బెనర్జీ భాగవతార్, లోకనాథం నందికేశ్వరరావు, జి.ఆనంద్, గజల్ శ్రీనివాస్, పి.సుశీల, రావి కొండలరావు, శరత్‌బాబు వంటి కళాకారులు మన జిల్లావారే. కోడి రామమూర్తి, కరణం మల్లేశ్వరి, పూజారి శైలజ, నీలంశెట్టి లక్ష్మీ వంటి క్రీడాకారులు జిల్లాకు చెందిన వారే. వీర గున్నమ్మ, చౌదరి సత్యనారాయణ, గౌతు లచ్చన్న, పొట్నూరు స్వామిబాబు, బంకుపల్లి మల్లయ్యశాస్త్రి వంటి సంఘ సంస్కర్తలు మన జిల్లావాసులు కావడం గర్వకారణం.


విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రను వేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నులిపురుగుల నివారణతో

పిల్లలకు ఆరోగ్యం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణతో పిల్లలకు శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన స్థానిక ఎన్టీఆర్ మునిసిపల్ హైస్కూల్‌లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ 'పిల్లలు, కిశోర బాలల కడుపులో నులిపురుగులు ఉంటే వారిలో పోషకాహార లోపం, రక్తహీనత, నీరసం, శారీరక, మానసిక ఎదుగుదలలో లోపాలకు గురవుతారు. అంగన్‌వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో ఉచితంగా ఈ మాత్రలను పంపిణీ చేస్తున్నాం. ఈ మాత్రలను వేసుకుంటే నులిపురుగులను సులభంగా నివారించవచ్చు. దీని వలన దుష్పరిణామాలు ఉండవు. ఒకవేళ ఇబ్బంది ఎదురైతే దగ్గరలోని పీహెచ్‌సీ వైద్యాధికారిని సంప్రదించాల'ని తెలిపారు. కార్యక్రమంలో జోనల్ మలేరియా అధికారి డా.బి.మీనాక్షి, డీఎంహెచ్‌వో డా.కె.అనిత, డీపీవో ఇ.వెంకటరావు, మలేరియా మేనేజర్ అప్పలనాయుడు, వైద్యులు, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


పలాసలో ట్రాక్టర్లతో ర్యాలీ



పలాస: విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గౌతు శిరీష, కూటమి నేతలు, కార్యకర్తలు, రైతులు

ప్రజల కోసమే.. కూటమి పాలన

విజయవంతంగా ట్రాక్టర్లతో ర్యాలీ

- ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజల కోసమే పనిచేస్తోందని చెప్పడానికి అన్నదాత సుఖీభవ పథకమే నిదర్శనమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక టీడీపీ కార్యాలయం నుంచి మూడు నాలుగు కిలోమీటర్ల పొడవునా ట్రాక్టర్లు, బైక్ ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయమార్కెట్ (మిగతా 6వ పేజీలో..)

సంక్షోభం వీడి.. సంక్షేమం వైపు..

- ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ పాలనలో వ్యవసాయ రంగం సంక్షోభంలో పడింది. నేడు సీఎం చంద్రబాబు నేతృత్వంతో సంక్షేమ బాట పట్టింద'ని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకంనిధులను రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పాతపట్నంలో రైతులు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏఎంసీ ప్రాంగణంలో ఎమ్మెల్యే గోవిందరావు మాట్లాడుతూ.. 'అన్నదాతకిచ్చిన మాటను చంద్రన్న నిలబెట్టుకొన్నారు. ధాన్యం (మిగతా 6వ పేజీలో..)


పాతపట్నం: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, కూటమి శ్రేణులు, రైతులు

తూకంలో తేడా వస్తే చర్యలు

- జిల్లా అసిస్టెంట్ కమిషనర్ పి.చిన్నమ్మ
- పలాసలో 14 కేసులు నమోదు

పలాస, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తూకంలో తేడాలు వస్తే చర్యలు తప్పవని తూనికల కొలతలశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ పి.చిన్నమ్మ హెచ్చరించారు. మంగళవారం పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో కిరాణా, చికెన్, మాంసం, చేపల షాపుల్లో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొత్తం 14 కేసులు నమోదు చేశారు. అసిస్టెంట్ కమిషనర్ చిన్నమ్మ మాట్లాడుతూ 'వినియోగదారులకు నాణ్యమైన సరకులతోపాటు తూకం సక్రమంగా ఉండాలి. జిల్లావ్యాప్తంగా నిరంతరంగా తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తాం. పలాస-కాశీబుగ్గలో ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయి. మూడు చేపల దుకాణాలు, ఆరు కిరాణాషాపులు, రెండు చికెన్ దుకాణాలు, ఒక్కో ఫ్రూట్‌షాపు, హార్డ్‌వేర్, ఫర్నీచర్ దుకాణాల్లో తనిఖీ చేశాం. తూకాల్లో తేడా రావడంతో కేసులు నమోదు చేశాం. కాటాలకు ఏటా ప్రభుత్వ ముద్రలు వేసుకోవాల'ని తెలిపారు. కాటా వర్కర్లు, సిబ్బంది కుమ్మక్కవుతున్నట్లు తమకు ఫిర్యాదులందుతున్నాయని, ఇకపై అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో శ్రీకాకుళం ఇన్‌స్పెక్టర్, పలాస ఇన్‌చార్జి ఏ.బలరామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.


కిరాణాషాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

కుడి ఎడమైతే.. పొరపాటు లేదోయ్

- నేడు లెఫ్ట్ హ్యాండర్స్ డే

మెళియపుట్టి/ శ్రీకాకుళం కల్చరల్/ సోంపేట/ సరుబుజ్జిలి/ పలాస, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): 'కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్'..అన్నాడో ఓ సినీ కవి. కుడిచేత్తో రాయడం నేర్చుకో. కుడికాలు పెట్టి లోపలకి రా.. అంటూ ఎడమను చాలా మంది తక్కువగా చూస్తారు. ఈ వివక్ష ఎందుకనేది జవాబు దొరకని ప్రశ్న. చాలా మంది సహజంగా ఏ పని అయినా కుడిచేత్తోనే చేస్తారు. కానీ.. కొందరు మాత్రం ఎడమచేతిని వినియోగిస్తూ ప్రత్యేకంగా కనిపిస్తారు. వాస్తవానికి ఎడమ చేతివాటానికి చెందిన ఎంతో మంది ఉన్నత స్థానాల్లో రాణించారు. ఎడమచేతి రాతగాళ్లకు మెదడు చాలా స్పీడ్‌గా పనిచేస్తుందని, తెలివితేటలు ఎక్కువగా ఉంటాయని పలు పరిశోధనల్లో కూడా తేలింది. బుధవారం 'లెఫ్ట్ హ్యాండర్స్ డే' సందర్భంగా జిల్లాలో ఎడమచేతి వాటానికి చెందిన కొంతమంది విజయ (మిగతా 6వ పేజీలో..)

వైద్యుడిగా.. థర్మల్ ఉద్యమకారుడిగా గుర్తింపు



సోంపేటకు చెందిన డాక్టర్ వై.కృష్ణమూర్తికి చిన్నప్పటి నుంచి ఎడమ చేతివాటమే అలవాటు. ఆయన ఓవైపు వైద్యసేవలు అందిస్తూ.. మరోవైపు థర్మల్ ఉద్యమ పోరాటంలో కీలకపాత్ర పోషించారు. ఉద్యమానికి మార్గదర్శిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. 'నా చిన్నప్పటి నుంచి ఏ పనైనా ఎడమచేతితో చేసేవాడిని. అప్పట్లో అంతా చిత్రంగా చూసేవారు. ఉన్నత చదువుల అనంతరం వైద్యవృత్తిలో సేవలు అందించాను. సోంపేట సమీపంలోని బీలలో ఏర్పాటు చేయదలచిన థర్మల్ పవర్‌ప్లాంట్ వల్ల పర్యావరణానికి కలుగనున్న నష్టాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాను. ఉద్యమం చేపట్టి థర్మల్‌ను అడ్డుకున్నామ'ని కృష్ణమూర్తి తెలిపారు.



కొత్త అనుభూతి ఇస్తోంది

చిన్నతనం నుంచి ఎడమచేతిరాతకు అలవాటు పడ్డాను. ఎదుటివారు కుడిచేతితో రాస్తుంటే.. నేను ఎడమ చేతితో రాస్తుండడం భిన్నంగా అనిపించేది. ఉన్నతచదువులు పూర్తి చేసినా ఎడమచేతి వల్ల ఎటువంటి ఇబ్బంది రాలేదు. రాత కూడా సక్రమంగా వచ్చేది. తప్పులు దొర్లకుండా రాస్తుండడం ఒక అనుభూతి. చదువుతున్న కాలంలో తోటి విద్యార్థులతో కలిసి ఉత్సాహంగా రాస్తుండడాన్ని అంతా వింతగా చూసేవారు. ఉపాధ్యాయులు కూడా నన్ను ప్రోత్సహించారు.

- ఎన్.రామారావు, మునిసిపల్ కమిషనర్, పలాస-కాశీబుగ్గ

ఉద్దానంలో విధ్వంసం సృష్టిస్తే సహించం

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

హరిపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పచ్చటి ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో విధ్వంసం సృష్టిస్తే సహించేదిలేదని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. మంగళవారం మందస మండలంలోని ఎయిర్‌పోర్టు నిర్మాణ ప్రతిపాదిత గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఎం.గంగువాడ నుంచి రాంపురం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎయిర్‌పోర్టు నిర్మాణ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు అధ్యక్షతన రాంపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఎయిర్‌పోర్టు పేరుతో పచ్చని జీడి, కొబ్బరి తోటలు నాశనం చేయవద్దు. బలవంతపు భూ సేకరనణ నిలిపివేయాలి. ఢిల్లీ వంటి పట్టణంలో కేవలం 150 ఎకరాల్లో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మిస్తే.. ఇక్కడ 1400 ఎకరాలు సేకరించి (మిగతా 7వ పేజీలో..)


మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

మట్టిలో కలిసే అవయవం.. ఎందరికో పునర్జన్మ





● జిల్లా వాసుల్లో పెరుగుతున్న అవగాహన ● స్వచ్ఛందంగా ముందుకొస్తున్న వైనం
● అపోహలు తొలగిస్తే మరింతమంది ముందుకు.. ● నేడు జాతీయ అవయవదాన దినోత్సవం

● పర్లాకిమిడికి చెందిన రమణమ్మ కొద్దిరోజుల కిందట రోడ్డు ప్రమా దానికి గురై తీవ్రగాయాలపాలైంది. బ్రెయిన్ డెడ్ కావడంతో వైద్యుల సూచన మేరకు కుటుంబసభ్యులు అవయవదానానికి ముందుకొచ్చారు. ఈ నెల 7న ఆమె మృతిచెందగా.. మహిళ అవయవాలను గ్రీన్ చానల్ ద్వారా తరలించారు.

● జూలై 29న కోటబొమ్మాళి మండలం నిమ్మాడ జంక్షన్‌కు చెందిన పినిమింటి శ్రీరామ్ అనే యువకుడికి రోడ్డుప్రమాదంలో తీవ్రగా గాయాలు అయ్యాయి. జెమ్స్‌కు తరలించగా బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు నిర్ధారించారు. వారి సూచన మేరకు కుటుంబసభ్యులు అవయవదానానికి ముందుకొచ్చారు. దీంతో అవయవాలను గ్రీన్ చానల్ ద్వారా తరలించారు.

● లావేరు మండలం కేశవరాయునిపాలెం గ్రామానికి చెందిన ప్రియా ంకతో చీపురుపల్లి మండలం పత్తికాయవలస గ్రామానికి చెందిన బాలి శ్రీనివాస నాయుడుకు మే నెలలో వివాహం అయింది. ఓ మంచి కార్యక్ర మానికి శ్రీకారం చుడదామని భావించి ఇరు కుటుంబాల వారు 60 మంది మరణా నంతం అవయవదానానికి అంగీకరిస్తూ పత్రాలు అందించారు. ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారా వాటిని ప్రభుత్వానికి అందజేశారు.

● గత ఏడాది డిసెంబరు 26న మందసకు చెందిన కొంకి జోగారావు అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే శ్రీకాకుళం ఆస్పత్రికి తరలించగా బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు గుర్తించారు. తల్లి దండ్రులకు అవగాహన కల్పించగా వారు అవయవదానానికి ఒప్పుకున్నారు. దీంతో ఆయన నేత్రాలు, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, కాలేయం వంటివి సేకరించి ప్రత్యేక విమానంలో హైదరాబాద్, చెన్నైకి తరలించారు.



చనిపోయాక మట్టిలో కలిసిపోయే అవయవాలు ఇలా ఆపదలో ఉన్న మరో మనిషి ప్రాణాలను నింపుతున్నాయి. మరణశయ్యపై ఉన్నవారి శరీర భాగాలు మరొకరికి పునర్జన్మనిస్తున్నాయి. ఆత్మీయులను కోల్పోయామనే దుఃఖంలోనూ... మరొకరి రూపంలో బతికున్నారనే భావనతో అవయవదానం సాధ్యమవుతోంది. బుధవారం జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

రణస్థలం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అవయవదానంపై ప్రజల్లో అవ గాహన పెరుగుతోంది. దానం చేసిన వారి కుటుంబాల్లో ఇది విషాదమే అయినా.. మరి కొన్ని కుటుంబాల్లో మాత్రం వెలుగులు నింపుతోంది. ప్రమాదాలు జరిగి.. మృత్యు వాత పడాలని, గాయపడాలని ఎవరూ కోరు కోరు. కానీ అనుకోకుండా జరిగేదే ప్రమాదం. అలాంటి సమయంలో క్షతగాత్రులైన వారు కోలుకోవడం చూస్తుంటాం. బ్రెయిన్‌డెడ్ అయిన వారికి మాత్రం బాగుచేయలేం. అలాంటి వారి అవయవాలను అయినవారి సమ్మతితో దానం చేయవచ్చు. మరికొన్ని కుటుంబాల్లో వెలుగులు నింపవచ్చు. జీవన్‌దాన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వమే గ్రీన్ చానల్ ద్వారా వాటిని తరలించే ఏర్పాటు చేస్తుంది. అందుకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది.

అలా సేకరిస్తారు..

బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి కాలే యం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, గుండె, గుండె కవటాలు, పేగులు, క్లోమం, కార్నియా వంటివి సేకరించి మరొకరికి అమర్చవచ్చు. జీవించి ఉన్న వ్యక్తుల నుంచి మూత్రపిండాలు, ఎముకలోని మూలుగు, కాలే యంలోని కొంత భాగం దానం చేయవచ్చు. అయితే ఆస్పత్రుల్లో చాలామంది అవయ వాలు సరిగ్గా పనిచేయక సతమతమవు తుంటారు. మరికొందరు మరణిస్తుంటా రు. అటువంటి వారికి అవయవదానం పునర్జన్మనిస్తుంది. ఎవరైనా బ్రెయిన్ డెడ్ అయ్యారని నిర్ధారించేందుకు వైద్యపరంగా, చట్టపరంగా కట్టుదిట్టమైన విధానాలు ఉన్నా యి. ఒక ఆస్పత్రి వైద్యులే దీనిని నిర్ధారించరు. ఇతర ఆస్పత్రి వైద్యులు, జీవనదాన్ సంస్థ తరుపున వచ్చే ప్రతినిధులు బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి శరీరాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తారు. తిరిగి 6 గంటల తరువాత మరో బృందం పరిశీలిస్తుంది. అప్పుడే బ్రెయిన్ డెడ్ అయినట్టు నిర్ధారిస్తారు. ఇందుకు వైద్యపరంగా కొన్ని అంశాలను పరిగణలోకి తీసుకుంటారు.

● తమకు తాముగా శ్వాసతీసుకునే పరిస్థితి లేకపోవడం, కృత్రిమ శ్వాస (వెంటిలేటర్) తొలగిస్తే 5 నిమిషాల్లో చనిపోయే స్థితి ఉండడం

● కనుపాపల్లో వెలుతురు పడినా ఎలాంటి స్పందన లేకపోవడం

● కాళ్లు, చేతులు, తల ఏమాత్రం కదపలేకపోవడం

● ఈఈజీ పరీక్ష చేసినప్పుడు మెదడులో చలనం ఏమాత్రం లేదని స్పష్టం కావడం, మెదడుకు ఏమాత్రం రక్తప్రసరణ జరగడం లేదని నిర్ధారణ కావడం.

● కొన్నిరకాల మందులు ఇచ్చినా ఎలాంటి స్పందన లేకపోవడం.. ఇలా అన్నీ నిర్ధారించిన తరువాత అవయవదానానికి అనుమతి ఉంటుంది. ఈ వైద్యులంతా జీవనదాన్‌లో నమోదై ఉండాలి. చనిపోయిన వారికి కానీ.. అవయవాలు అవసరమైన వారికి కానీ బంధువులు అయి ఉండకూడదు. ఇలా అవయవదానంలో ప్రతి అంశం, నిబంధన కఠినతరమే.

అవగాహన పెరిగితే ప్రయోజనం..

అవయవదానంపై ప్రజల్లో ఇంకా అవగాహన పెరగాల్సి ఉంది. రోడ్డు ప్రమాదాలు, ఇతరత్రా కారణాలతో చాలామంది బ్రెయిన్ డెడ్ అవు తుంటారు. అటువంటి వారిని గుర్తించి కుటుంబ సభ్యులను ఒప్పించగలిగితే మరికొందరి ప్రాణా లను నిలబెట్టవచ్చు. అవయవాల సేకరణ, తరలింపు, కేటాయింపు వంటిని జాతీయస్థాయి లో జాతీయ అవయవ, కణజాల మార్పిడి సంస్థ (ఎన్‌ఓటీటీఓ) పర్యవేక్షిస్తోంది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి జీవన్ దాన్, ఇండియన్ రెడ్‌క్రాస్ వంటి సంస్థలు బాధ్యతలను చూస్తున్నాయి.

కూటమి అధికారంలోకి వచ్చాక..

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అవ యవదానంపై అవగాహన కార్యక్రమాలు వేగ వంతం అయ్యాయి. ప్రభుత్వం అవయవ దాతల కుటుంబాలకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. దాత అంత్యక్రియలకు కలెక్టర్ లేదా ప్రభుత్వ తరుపున ఒక ప్రతినిధి తప్పకుండా హాజరుకావాలని ఆదేశించింది. అంత్యక్రియ ఖర్చులకు రూ.10 వేలు కూడా అందిస్తోంది. అయితే అవయవాలు తరలింపునకు వీలుగా గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇప్పటికే కొన్ని మార్గాలను సైతం ఎంపిక చేసింది.

అవగాహన పెరుగుతోంది..



అవయవదానంపై అవగా హన పెరుగుతోంది. కూటమి ప్రభుత్వం దీనికి ఎంతగానో సహకరిస్తోంది. సరికొత్త మార్గ దర్శకాలు సైతం జారీచే సింది. ప్రజల్లో కూడా చైతన్యం పెరు గుతోంది. శ్రీకాకుళం జిల్లాలో ఇటీవల అవయవ దానానికి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు ముందుకు రావడం శుభ పరిణామం.

-డాక్టర్ కె.రాంబాబు, జీవన్‌దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్

పుట్టెడు దుఃఖంలోనూ.. కుమార్తె అవయవాలు దానం



పప్పు సుశీల (ఫైల్)

గార రూరల్, 12(ఆంధ్రజ్యోతి): గార మండలం కె.మత్స్యలేశం పంచాయతీ వాడపాలేనికి చెందిన పప్పు సుశీల ఈ ఏడాది మే 16న రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కుమార్తె మృతి చెందిన పుట్టెడు దుఃఖంలోనూ ఆమె అవయవాలు దానం చేసేందుకు తల్లిదండ్రులు గోవిందరావు, జ్యోతి అంగీకరించారు. జెమ్స్‌లో సుశీల గుండె, కళ్లు, లివర్, కిడ్నీ, లంగ్స్ వంటి అవయవాలను దానం చేశారు. సుశీల కళింగపట్నం సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వహించేది. తమ కుమార్తె మృతి చెందినా.. ఎంతోమందికి ప్రాణదాతగా నిలిచినందుకు తమకు గర్వంగా ఉందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. భౌతికంగా తమ మధ్య లేకపోయినా.. ఆమె అవయవాల ద్వారా వేరొకరి రూపంలో జీవిస్తుందనే తృప్తితో బతుకుతున్నామని తెలిపారు.

మరణించినా.. నలుగురిని బతికిస్తూ..



మౌనిక (ఫైల్)

అరసవల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలం కొత్తపేటకు చెందిన బొడిగి మౌనిక కొన్నాళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందినా.. అవయవదానంతో నలుగురి జీవితాల్లో బతుకు నింపింది. మౌనిక 19 ఏళ్లకే ప్రభుత్వ ఉద్యోగం సాధించింది. శ్రీకాకుళంలోని రైతుబజారు వద్ద సచివాలయంలో వీఆర్వోగా పనిచేసేది. విధుల్లో భాగంగా సచివాలయం నుంచి ఎమ్మార్వో కార్యాల యానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఇద్దరు యువకులు మరో దిచక్రవాహనంతో ఢీకొనడంతో ఆమె మృతి చెందింది. ఆమె అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. దీంతో ఆమె కళ్లను ఐదేళ్ల చిన్నారికి, మరో 45 ఏళ్ల వ్యక్తికి, గుండెను సుస్మిత అనే 21 ఏళ్ల యువతికి, కిడ్నీలను మరో ఇద్దరికి, లివర్‌ను ప్రాణాపాయంలో ఉన్న మరో వ్యక్తికి అమర్చారు. తమ కుమార్తె మరణించినా.. అవయవదానంతో నలుగురిలో బతికే ఉందన్న తృప్తితో తాము జీవనం సాగిస్తున్నామని ఆమె తల్లిదండ్రులు గోవిందరావు, ఉమాదేవి తెలిపారు.

సిక్కోలు వజ్రోత్సవం

(ఐదో పేజీ తరువాయి)

విభజించి గజపతినగరం తాలుకాగా ఏర్పాటు చేశారు. 1979 లో సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం తాలుకాలు వేరుపడి.. విశా ఖలో ఉన్న విజయనగరం తాలుకాతో కలిపి.. విజయనగరం జిల్లా ఏర్పాటైంది. 1983లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత స మితి వ్యవస్థ రద్దయింది. వాటి స్థానంలో 37 మండలాలు ఏర్పా టయ్యాయి. 1999లో చివరిసారిగా సరుబుజ్జిలి మండలం నుంచి వేరుపడి 19 పంచాయతీలతో లక్ష్మీనర్సుపేట మండలం ఏర్పాటైం ది. 2022 ఏప్రిల్ 4న జిల్లాలోని పాలకొండ నియోజకవర్గం పార్వ తీపురం మన్యంలో, రాజాం నియోజకవర్గం విజయనగరం జిల్లా లో విలీనమైంది. దీంతో శ్రీకాకుళం జిల్లాలో 8 నియోజకవర్గాలు మిగిలాయి. ప్రస్తుతం 30 మండలాలతో కొనసాగుతోంది.

● నాయకుల పుట్టినిల్లు..

ఎందరో మహనీయులు జిల్లా నుంచి అధికారులుగా, ప్రజాప్ర తినిధులుగా తమ ప్రస్థానాన్ని ప్రారంభించారు. జిల్లా పరిషత్‌కు తొలి చైర్మన్‌గా బెండి కూర్మన్న వ్యవహరించారు. జిల్లా తొలి కలెక్టర్‌గా షేక్ అహ్మద్ బాధ్యతలు చేపట్టారు. జిల్లా ఏర్పడిన తొలినాళ్లలో సర్దార్ గౌతు లచ్చన్న, బొడ్డేపల్లి రామ్మోహన్‌రావు, లుకలాపు లక్ష్మణదాస్, గొర్లె శ్రీరాములనాయుడు, మజ్జి తులసీ దాస్, బగ్గు సరోజినీదేవి, పాలవలస రుక్మిణమ్మ వంటి నాయకు లు రాజకీయాల్లో రాణించారు. సర్దార్ గౌతు లచ్చన్న స్వాతంత్ర ద్యోమంలో పాలుపంచుకున్నారు. 1952లో తొలిసారిగా కృషీకర్ లోక్‌పార్టీ తరుపున సోంపేట నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచారు. అలాగే బొడ్డేపల్లి రాజగోపాలరావు సుదీర్ఘకాలం శ్రీకాకు ళం ఎంపీగా పదవి చేపట్టారు. 1952 నుంచి నిరంతరాయంగా గెలుస్తూ వచ్చారు. ఒక్కసారి మాత్రమే ఓడిపోయారు. జిల్లాకు చెందిన మజ్జి తులసీదాస్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడయ్యా రు. జిల్లాకు చెందిన కింజరాపు ఎర్రన్నాయుడు శ్రీకాకుళం ఎంపీ గా ప్రాతినిథ్యం వహిస్తూ కేంద్రమంత్రి అయ్యారు. మరో మహిళా ఎంపీ కిల్లి కృపారాణి సైతం కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కిం చుకున్నారు. ప్రస్తుత ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రిగా ఉన్నారు. కింజరాపు అచ్చెన్నాయుడు, కిమిడి కళా వెంకటరావులు టీడీపీ రాష్ట్ర అధ్య క్షులుగా పనిచేశారు. ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్, గౌతు శివా జీ, గుండ అప్పలసూర్యనారాయణ వంటి నేతలు అమాత్యులుగా రాణించారు. తొలి మహిళా అసెంబ్లీ స్పీకర్‌గా కావలి ప్రతిభాభార తి అరుదైన అవకాశాన్ని దక్కించుకున్నారు. జిల్లాకు చెందిన రొ క్కం లక్ష్మీనరసింహం దొర, తంగి సత్యనారాయణ, ప్రతిభాభారతి, తమ్మినేని సీతారాంలు ఏపీ అసెంబ్లీ స్పీకర్లయ్యారు. ఇలా జిల్లాకు చెందిన ఎంతోమంది నేతలు రాజకీయంగా రాణించారు.

పొందరి, కూరాకుల కార్పొరేషన్ చైర్మన్‌గా నర్సింహులు



బడ్డ దామెదర నర్సింహులు

నరసన్నపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం శ్రమించిన కార్యకర్త, బొరిగివలస గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బడ్డ దామోదర నర్సింహులు రాష్ట్ర పొందరి, కూరాకుల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. బొరిగివలస పంచాయతీలో టీడీపీ ఆవిర్భావం సమయంలో... కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న రోజుల్లో పసుపు జెండాను పట్టుకొని.. ముందుకు నడిపించిన దామోదర నర్సింహులుకు పార్టీ గుర్తింపు ఇచ్చిందని శ్రేణులు తెలిపారు. ఈమేరకు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడులకు స్థానిక నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్

(ఐదో పేజీ తరువాయి)

ప్రస్థానాన్ని తెలుసుకుందాం. సరుబుజ్జిలి గ్రామానికి చెందిన బెండి చిన్నారావు అనే దివ్యాంగుడు ఎడమ చేతిరాతతోనే మండల విద్యాశాఖ కార్యాలయంలో సీఆర్‌ఎంటీగా విధులు నిర్వహిస్తున్నారు. 'పోలియో వ్యాధి బారిన పడి చిన్నతనంలోనే రెండు కాళ్లు పూర్తిగా చచ్చుబడిపోయాయి. తండ్రి సాయంతో పాఠశాలకు వెళ్లేవాడిని. కుడిచేత్తో రాయలేకపోయేవాడిని. ఎడమ చేతితో రాయడం అలవాటు చేసుకున్నా. డబుల్ ఎంఏ హిస్టరీ, ఎంఏ తెలుగు బీఈడీ పూర్తి చేశాను. కుటుంబ సభ్యుల సహకారంతో సీఆర్‌ఎంటీగా పనిచేస్తున్నా'నని చిన్నారావు తెలిపారు. అలాగే సరుబుజ్జిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడు సీపాన జగన్నాథరావుకు కూడా ఎడమ చేతివాటమే అలవాటు. డిజిటల్ బోర్డుపై ఎడమ చేతితో రాస్తూ.. బోధన సాగిస్తున్నారు.

● శ్రీకాకుళంలోని రాధాకృష్ణనగర్‌కు చెందిన బీహెచ్ స్వాతి, గూనపాలెనికి చెందిన వసుంధర, ప్రైవేటు కళాశాల ఉపాధ్యాయుడు మురళీకృష్ణ తదితరులు ఎడమ చేతివాటంతోనే తమ వృత్తుల్లో రాణిస్తున్నారు. భోజనానికి మాత్రమే కుడిచేతిని వినియోగిస్తామని, మిగతా కార్యక్రమాలన్నీ ఎడమచేతితోనే చేస్తామని వారు తెలిపారు.



ఎడమ చేతితో రాస్తున్న సీఆర్‌ఎంటీ చిన్నారావు



ఎడమ చేతితో రాస్తున్న హిందీ ఉపాధ్యాయుడు జగన్నాథరావు



అప్పట్లో హేళన చేశారు

నేను చిన్నప్పుడు ఎడమ చేతితో రాస్తే తరగతి గదిలో కొంతమంది హేళన చేశారు. నేను భోజనానికి మాత్రమే కుడిచేతిని వినియోగిస్తాను. క్రికెట్ బ్యాటింగ్, బౌలింగ్‌కు ఎడమ చేతిని వినియోగిస్తే నాకు కలిసివచ్చేది. అందుకే ఎడమచేతి వాటాన్ని అలవాటుగా మార్చుకున్నాను. మహాత్మా గాంధీజీ, అబ్దుల్‌కలాం వంటి మహనీయులు ఎడమ చేతితో రాస్తారని తెలుసుకుని మురిసిపోయేవాడిని. నేను తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టి ప్రమాణ స్వీకారం చేసిన రోజు.. ఎడమ చేతితో సంతకం చేయడాన్ని చూసి కొంతమంది ఎమ్మెల్యేలు అభినందించడం సంతోషంగా భావించాను.

-మామిడి గోవిందరావు, పాతపట్నం ఎమ్మెల్యే



నారాయణవలస పశువుల సంత

ఈ సారైనా పాట సాగేనా?

● 'నారాయణవలస'లో ఆశీలుకు నాలుగోసారి వేలం

కోటబొమ్మాళి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలోనే అతిపెద్దదిగా పేరొందిన నారాయణవలస గురువారపు సంతలో ఆశీల వసూలుకు మరోసారి వేలంపాటకు అధికారు లు సిద్ధమవుతున్నారు. గత జూలై 10 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఆశీలు వసూ లు చేసుకునేందుకు వీలుగా గతంలో వేలం పాట నిర్వహించారు. జూలై 10, 14, 16 తేదీ లలో వరుసగా మూడుసార్లు వేలం పాట నిర్వహించారు. కానీ పాటదారులు హాజరు కాలేదు. దీంతో మండల పరిషత్ సిబ్బందితో ప్రతి గురువారం ఆశీలు వసూలు చేయిస్తు న్నట్టు ఎంపీడీవో ఫణీంద్ర కుమార్ తెలిపా రు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 18న ఉదయం 10 గంటలకు నాలుగో సారి మండల పరిషత్ కార్యాలయంలో వేలంపాట నిర్వహించనున్నారు. ఆసక్తి గల వారు వారు పాటలో పాల్గొనాలని ఎంపీడీవో మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణవలస సంత వేలం పాట నిర్వ హించడం మొదలుపెట్టిన తరువాత సుమా రు 60 ఏళ్లలో ఇలా జరగడం ఇదే మొదటి సారి. ఈసారైనా పాటదారులు ముందుకు వస్తారో లేదో చూడాలి.



రాజులు చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి, సుడా చైర్మన్ రవికుమార్ తదితరులు

పర్యాటక కేంద్రంగా రాజులు చెరువు

నరసన్నపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పట్ట ణ నడిబొడ్డున గల రాజులు చెరువును పర్యాటక కేంద్రంగా అ భివృద్ధి చేసేందుకు కంకణం కట్టుకున్నట్టు సుడా చైర్మన్ కొరికా న రవికుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి రాజులు చెరువు ప్రాంతాన్ని ఆయన ప రిశీలించారు. కళాశాల రోడ్డును విస్తరించి.. వ్యాణిజ్య కాంప్లెక్స్ నిర్మాణం చేపడతామన్నారు. ట్రాక్ నిర్మాణం, చెరువును పర్యాట క ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి సుడా నిధులు కేటా యిస్తామన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బలగ ప్రవీణ్ కుమార్, సుడా ఇంజనీరింగ్ అధికారి కరుణాకర్, కూటమి నా యకులు భైరి భాస్కరరావు, ఎంవీ నాయుడు పాల్గొన్నారు.

ప్రజల కోసమే.. కూటమి పాలన

(ఐదో పేజీ తరువాయి)

కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ 'ఎన్నికల హామీల్లో భాగంగా తొలుత పింఛన్ల నగదు పెంచాం. తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాకు నగదు జమచేశాం. ప్రస్తుతం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల ఖాతాల్లో తొలివిడతగా రూ.7వేలు జమ చేశాం. ఈ నెల 15 నుంచి మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం. ప్రతీ హామీని అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కింద'ని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వైసీపీ నాయకులకు కనిపించడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, రాష్ట్ర బిసిసెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, ఎం.నరేంద్ర(చిన్ని), టంకాల రవిశంకర్‌గుప్తా, జోగ మల్లి, కొత్త సత్యం, ఎ.రామకృష్ణ, యవ్వారి మోహనరావు, కొర్ల కన్నారావుతోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షోభం వీడి.. సంక్షేమం వైపు..

(ఐదో పేజీ తరువాయి)

కొనుగోలు చేసిన 48గంటలలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తూ వారికళ్లల్లో ఆనందం నింపారు. సూపర్ సిక్స్ పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నామ'ని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్, ఏఎంసీ అధ్యక్షుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్యులను విచారిస్తున్న సీఐ శ్రీనివాసరావు

నకిలీ దివ్యాంగుల ధ్రువపత్రాలపై పోలీసుల ఆరా

● కౌంటర్ సంతకాలు చేసిన వైద్యుల విచారణ

నరసన్నపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట సామాజిక ఆసుపత్రిలో గత ప్రభుత్వ హయాంలో నకిలీ దివ్యాంగుల ధ్రు వీకరణ పత్రాల జారీ వ్యవహారంపై సీఐ ఎం.శ్రీనివాసరావు మంగళవారం విచారణ చే పట్టారు. ఈ విషయంపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అట శాఖా పరంగా.. ఇటు పోలీసులు పరంగా విచారణ చేపట్టింది. పొందూరు, జలుమూరు, కోటబొ మ్మాళి, నరసన్నపేట తదితర మండలాలకు చెందిన వారికి ఆర్థోపెడిక్ విభాగంలో ఎక్కు వగా సకలాంగులకు.. దివ్యాంగులుగా ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. దీనిపై పోలీసులు ముమ్మురంగా దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా అప్పట్లో సూపరెంటెండెం ట్‌గా పనిచేసిన జయశ్రీ, ధ్రువపత్రాలపై కౌంటర్ సంతకాలు చేసినట్లు ఉన్న డా.నవీ న్, నాగమల్లేశ్వరిని విచారించారు. వీరి ప్రమే యం లేకుండా అప్పట్లో ఒక వైద్యుడు, కం ప్యూటర్ ఆపరేటర్, ఆసుపత్రిలోని ఒక ఉద్యో గి పాత్ర ఉన్నట్టు దర్యాప్తులో వైద్యులు వెల్ల డించినట్లు సమాచారం. దీనిపై పూర్తి స్థాయి లో దర్యాప్తు నిర్వహించి... ఉన్నతాధికారులకు నివేదిస్తామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

రిటైర్డ్ పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని, రిటైర్మెంట్, డెత్ బెనిఫిట్స్ సకాలంలో అందించేందుకు ప్రాధాన్యం ఇస్తామని ఎస్పీ కేవీ మహేశ్వ రరెడ్డి అన్నారు. ఉద్యోగ విరమణ, సర్వీసులో ఉంటూ మృతి చెందిన పోలీసులు, హోంగార్డుల కుటుంబ సభ్యులు సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కార మార్గాలపై మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్షించారు. పోలీస్ కుటుంబాలకు భద్రత, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, విడో, కార్పస్ ఫండ్, అడిషనల్ కార్పస్ ఫండ్, గ్రూప్ ఇన్సూరెన్స్, స్కీమ్, లీవ్ ఎన్‌క్యాష్ మెంట్ నగదు వంటివి ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రయోజనాలతో పాటు కారుణ్య నియామకాలు, వ్యక్తిగతమైన సమస్యలను సంబంధిత అధికారులు ఎస్పీకి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బెనిఫిట్స్‌కి సరైన ధ్రువపత్రాలు పోలీస్ కార్యాలయంలో అందించాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన పోలీస్ కుటుంబాలతో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు ప్రస్తుత పరిస్థితిని కార్యాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తక్షణం తగు చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కేవీ రమణ, పరిపాలనాధికారి సీహెచ్ గోపీనాథ్, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఆర్ఐలు కేవీ నరసింగరావు, శంకర్ ప్రసాద్, సహాయ పరిపాలనాధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులు, రిటైర్డ్ సిబ్బంది కుటుంబాలు, మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎక్కువ కేసులు పరిష్కారానికి చర్యలు

● జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా


మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం లీగల్ ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 13న నిర్వహించనున్న లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా కోర్టు భవనంలో మంగళవారం పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. త్వరితగతిని కక్షిదారులకు న్యాయం చేకూర్చేలా పోలీసు అధికారులు ప్రయత్నం చేయాలన్నారు. 1, 3, 4 అద నపు జిల్లా న్యాయాధికారులు పి.భాస్కరరావు, వివేకానంద శ్రీనివాస్, ఎస్ఎం ఫణికుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరి బాబు, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.శ్రీధర్, పోలీసు అధికారులు వి. వెంకట అప్పారావు, పి.శ్రీనివాసరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి: డీఐవో

నరుబుజ్జిలి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐవో) డాక్టర్ రామదాసు అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం నంది కొండ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. జిల్లా మాస్ మీడియా అధికారి ముఖలింగం, ఎంఈవో ఎస్.సాహితీ ప్రియదర్శిని, సీహెచ్‌వో మోహన్‌రావు పాల్గొన్నారు.

98 శాతం మాత్రల పంపిణీ

కంచిలి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కంచిలి పీహెచ్‌సీ పరిధిలో 98 శాతం పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి హరిబాబు తెలిపారు. మంగళవారం డీవార్మింగ్ డే సందర్భంగా పీహెచ్ సీ పరిధిలో 46 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,185 మందికి గాను 1,160 మంది చిన్నారులకు, 43 పాఠశాలల్లో 4,688 మంది విద్యార్థులకు గాను 4,652, రెండు కాలేజీలలో 836 మందికి గాను 831 మందికి మాత్రలు పంపిణీ చేశామన్నారు.

జాతీయ సమైక్యతను చాటిచెప్పాలి


త్రివర్ణ పతాకాలతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

జి.సిగడాం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): దేశభక్తి, జాతీయ సమైక్యత భావాలను ప్రతిక్కరూ చాటి చెప్పాలని బీజేపీ మండల అధ్యక్షుడు పైల విష్ణుమూర్తి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బజారు వీధిలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వజ్జపర్తి రఘురాం, వికసిత్ భారత్ ఇన్‌చార్జి మీసాల రామకృష్ణ, గట్టెం అప్పలరాజు, మండల ప్రధాన కార్యదర్శి ముద్దాడ త్రినాథరావు, సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, ఎస్సీ మోర్చా నేత శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

కవిటి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మంగళవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ జెండాను పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.సింహాచలం నాయుడు మాట్లాడుతూ.. విద్యార్థులంతా సమైక్యతకు, దేశాభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాప కులు, సిబ్బంది పాల్గొన్నారు.

మురపాకను మండల కేంద్రంగా ప్రకటించండి

లావేరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మురపాకను మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ మురపాక మండల సాధన కమిటీ సభ్యులు మంగళవారం పలు పంచాయతీల నుంచి తీర్మానాలు సేకరించారు. మండలంలోని మురపాక, చినమురపాక, కేశవరాయునిపాలెం, తామాడ, పెద రావుపల్లి, బుడుమూరు, లక్ష్మీపురం, లోపెంట, చినరొంపివలస తదితర పది పంచాయతీల నుంచి తీర్మానాలు చేయించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జిల్లాలు, మండలాల పునర్విభజనకు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన నేపథ్యంలో స్థానిక యువత ముందుకు వచ్చి మురపాక సమీప గ్రామాల ప్రజల నుంచి అభిప్రాయాలు, తీర్మాణాల రూపంలో తీసుకుంటున్నారు. మండల కేంద్రం ఏర్పాటుకు మురపాకలో అన్ని సదుపాయాలున్నాయని, సమీప గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉంటుందని పలు గ్రామాల ప్రజలుఅభిప్రాయపడుతున్నారు.

రాష్ట్రస్థాయి వక్తృత్వ పోటీ విజేత గంగోత్రి

పాత శ్రీకాకుళం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆర్టీఐ చట్టం-2025పై రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వక్తృత్వ పోటీలో ప్రభుత్వ మహిళా కళాశాల ఫైనల్ బీకాం వొకేషనల్ విద్యార్థిని జె. గంగోత్రి విజేతగా నిలిచింది. ఈ మేరకు రాష్ట్ర ఇన్ఫర్మేషన్ కమిషనర్ పి. శామ్యూల్ ఆమెకు బహుమతిని అందించారు. ఈ సందర్భంగా గంగోత్రిని ప్రిన్సిపాల్ డా.కె.సూర్యచంద్రరావు తదితరులు అభినందించారు.

అసిరితల్లికి సారె సమర్పణ


అసిరితల్లికి సారె సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు

ఎచ్చెర్ల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని అసిరితల్లి గ్రామ దేవతకు గ్రామ ప్రజలు మంగళవారం సారెను సమర్పించారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని వేడు కుంటూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి వివిధ పిండి వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. గ్రామంలోని మహిళలు ఊరేగింపుగా అమ్మవారి గుడికి వెళ్లి మొక్కులు చెల్లించారు.

డీజే శబ్దాలు లేకుండా సహకరించాలి

సోంపేట రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): డీజే శబ్దాల వల్ల అనేక నష్టాలున్నాయని శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు మందిర నిర్వాహకులు సహకరించాలని జాగృతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రాంబుడ్డి గణపతి కోరారు. మంగళవారం నాలుగు మండలాలకు చెందిన మంది రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. రానున్న వినాయకచవితి, విజయదశమి నిమజ్జనోత్సవాల్లో సాధారణ బాక్సులతో ఊరేగింపు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వినాయక లైంటింగ్, సౌండింగ్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వరుణుడి కరుణ కోసం యాగం

సోంపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురవాలని కోరుకుంటూ మంగళవారం స్థానిక సోమేశ్వర స్వామి ఆలయంలో వరుణయాగం నిర్వహించారు. ఆలయకమిటీ చైర్మన్ బుంగ సత్యం ఆధ్వర్యంలో అర్చకులు సునీల్ పాణిగ్రాహి, సంతోష్ పాణిగ్రాహి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా రమేష్



ఆమదాలవలస, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా టీడీపీ సీనియర్ నాయకుడు మొదలవలస రమేష్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2014-19 సంవత్సరంలో ఈయన రాష్ట్ర నీటి యాజమాన్య సంస్థ సభ్యుడిగా వ్యవహరించారు. ఆ సందర్భంగా ఆయనను కూటమి నేతలు, కార్యకర్తలు అభినందించారు. రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పదవి కేటాయించడంతో సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానన్నారు.

మెనూ బిల్లులు పెంచాలి

రణస్థలం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూ బిల్లులను పెంచాలని, వంట కార్మికులకు రూ.10 వేలు వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జడ్పీ స్కూల్ ఆవరణలో మధ్యాహ్నం భోజన పథకం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూనియర్ కళాశాలల్లో 7 నెలల పెండింగ్ బిల్లులు, వంట కార్మికులకు బకాయిలను వెంటనే చెల్లించాని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు వి.లక్ష్మి, డి.లక్ష్మి, సుగుణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పొందూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పొందూరు రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్క రించాలని పొందూరు, జి.సిగడాం మండలాల పెన్షనర్లు, సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం రైల్వే సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు. దివ్యాంగులు, వృద్ధులు, చిన్నారులను దృష్టిలో ఉంచుకుని సౌకర్యంగా ఉన్న ఫ్లాట్ ఫాం-1ను శాశ్వతంగా కొనసాగించాలని కోరారు. పలాస నుంచి విశాఖ వైపు వైపు వెళ్లే రైళ్లను ప్లాట్‌ఫారం ఒకటి కాకుండా వేరే ప్లాట్ ఫారంకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. వినతిపత్రం అందించిన వారిలో పెన్షనర్లు ఎస్.పైడి రాజు, పి.సూర్య ప్రకాశ రావు, ఎ.ధర్మారావు, పి.దివాకరపాత్రో, ఎ.విజయ్ కుమార్ తదితరులున్నారు.

ఉద్దానంలో విధ్వంసం సృష్టిస్తే సహించం

(ఐదో పేజీ తరువాయి)

కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టకపోతే ఆందోళనలు తీవ్రం చేస్తాం. కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు.. ఉద్దానం అభివృద్ధి కోరుకోవాల'ని నారాయణ హితవు పలికారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవింరావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు వంకల మాధవ రావు, కె.మోహనరావు, బత్తిని లక్ష్మణ్, పి.కుసుమ, అరుణక్క, అజయ్‌కుమార్, శ్రీదేవి, బాల కృష్ణ, రుషి తదితరులు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణం చేపట్టండి

గార రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నుగ్గు దాలి నాయుడులో మురుగునీటి కాలువ నిర్మాణం చేపట్టాలని తహసీల్దార్ చక్రవర్తి ఆదేశిం చారు. గ్రామం మధ్యలో ఉన్న కాలువ శిథిలావస్థకు చేరుకుని మురుగునీరు నిలిచి దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో తహసీల్దార్ మంగళవారం గ్రామాన్ని సందర్శించి తగు చర్యల కోసం ఆదేశించారు.

ఘనంగా తులసమ్మ సంబరం

ఇచ్ఛాపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): లొద్దపుట్టి గ్రామదేవత ధనరాజ తులసమ్మతల్లి సంబరాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గొర్లెపాడు గ్రామానికి చెందిన జిల్లా ఐటీ కోఆర్డినేటర్ కాళ్ల దాలయ్య దంపతులు గ్రామం నుంచి గజముద్దల ఘటాలు, బిందెలతో పానకాలు, పసుపు నీటితో కాళీకా నృత్యాలే, మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి చల్లదనం చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రణస్థలం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. 25 కుటుంబాలకు రూ.22 లక్షల విలువైన చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి అండగా సీఎం చంద్రబాబు నాయుడు నిలిచారని పేర్కొంటూ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, లావేరు, జి.సిగడాం, రణస్థలం మండలాల టీడీపీ అధ్యక్షులు ముప్పిడి సురేష్, కె.రవికుమార్, లంక శ్యామలరావు, కూటమి నాయకులు పిసిని జగన్నాథం నాయుడు, కూనపల్లి దామోదరరావు పాల్గొన్నారు.


చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

సమస్యలను పరిష్కరించాలి

అరసవల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్య దర్శి వై.అప్పయ్య, ఉపాధ్యక్షుడు ఎన్వీఆర్ మూర్తి మాట్లాడుతూ.. వేతన సవరణ జరిగి రెండేళ్ల యిందని, వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత నాలుగేళ్లగా నిలిచిపోయిన పదో న్నతులను వెంటనే కల్పించాలని, ఉద్యోగుల వైద్య సేవలకు సంబంధించి, పాత విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగుల స్థానంలో ఏర్పడిన ఖాళీలను సుమారు 9 ఏళ్లుగా భర్తీ చేయడం లేదన్నారు. టిమ్స్ మిషన్లు సక్రమం గా పనిచేయడం లేదని, వాటి స్థానంలో కొత్త యంత్రాలను అందించాలని కోరారు. ధర్నాకి ఏపీజేఏసీ, ఎన్జీజీవో జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం సంఘీభావం తెలిపారు. కార్య క్రమంలో శ్రీకాకుళం 1, 2 డిపో కార్యదర్శులు, పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.


ధర్నా నిర్వహిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

మహిళా సంక్షేమమే ధ్యేయం

ఆమదాలవలస, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, ఇందులో భాగంగానే ఈనెల 15 నుంచి ఆర్టీసీలో ఉచిత బస్సు సదుపాయం అమలు చేస్తున్నారని డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు మంగళవారం టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటికే ఉచిత గ్యాస్ సిలెండర్లు, వితంతు పింఛన్లు, వివిధ విభాగాల ద్వారా రుణా ల మంజూరుతో ఉపాధి అవకాశాలు కల్పించి మహిళా పక్షపాతిగా పేరు పొందారన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎస్. మురళీధరరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణ

గురుకులంలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ



భోజన పదార్థాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పెద్దపాడు గ్రామంలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలను మంగళవారం రాత్రి ఎమ్మెల్యే గొండు శంకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వంట పదార్థాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి మంచి స్థానాలకు అందుకోవాలని కోరారు. పాఠశాలలో బోధన, వసతులు, సమస్యలపై సమగ్రంగా పరిశీలించి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు.

రెడ్‌క్రాస్ సేవలు స్ఫూర్తిదాయకం

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలు స్ఫూర్తి దాయకమని డీఆర్వో ఎం.వేంకటేశ్వర రావు అన్నారు. నగరంలోని తలసేమియా వ్యాధిగ్రస్థులకు చేపట్టే రక్తమార్పిడి కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని, గ్రామ స్థాయికి సేవలను విస్తరించాలని కోరారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న 83 మంది చిన్నారులకు ఉచితంగా రక్తం అందించడం అభినందనీయమన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ.. పిల్లలకు ఉచితంగా మందులు కూడా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మెడికల్ ఆఫీసర్ వి.సచిత్ర, మేనేజర్ గొలివి రమణ, సిబ్బంది పి.సుజాత, ఉమా శంకర్, జగదీష్, ప్రియాంక పాల్గొన్నారు.

ఎరువులను వినియోగించుకోండి


రైతులకు ఎరువులను పంపిణీ చేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, బాబ్జీ

ఎచ్చెర్ల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌కు సంబంధించి రాయితీపై అందిస్తున్న ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్ అన్నారు. ఫరీద్‌పేటలో మంగళవారం రైతులకు ఎరువులను పంపిణీ చేశారు. సాగునీటి కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి (బాబ్జీ), సర్పంచ్ కొత్తకోట పూర్ణచంద్రరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట అమ్మినాయుడు, పైడి ముఖలింగం పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కేజీబీవీ ప్రిన్సిపాళ్ల బదిలీ

పొందూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): లోలుగు కేజీబీవీ ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్యకు కంచిలి బదిలీ చేస్తూ ఎస్ఎస్ఏ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే గార కేజీబీవీ ప్రిన్సిపాల్ ఎస్. లలితకుమారిని పొందూరులో నియమించారు. గార కేజీబీవీకి కంచిలి ప్రిన్సిపాల్ బి.రజనీ కుమారిని బదిలీ చేశారు. వీరిపై వచ్చిన ఆరోపణలపై ఇటీవల విచారణ నిర్వహించిన అధికారులు నివేదికల ఆధారంగా శాఖాపరమైన చర్యల్లో భాగంగా బదిలీ చేసినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పొందూరు ప్రిన్సిపాల్ సౌమ్యపైనా ఇటీవల పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎస్ఎస్ఏ అధికారులకు, విద్యాశాఖా మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు.

ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు

పాత శ్రీకాకుళం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో వివిధ రిజ ర్వేషన్ల కింద ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఎస్ఏ ఏపీసీ డా. ఎస్.శశిభూషణ్ తెలిపారు. విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ, అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతుల పిల్లలకు 25 శాతం కోటా కింద దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆధార్ వివరాలతో రిజిస్టర్, గ్రామ సచివాలయం, మండల విద్యా వనరుల కేంద్రం, పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని, సీట్లను లాటరీ ద్వారా నిర్ణయిస్తారని ఆయన పేర్కొన్నారు.

సెమిస్టర్ పరీక్షల పరిశీలన

ఎచ్చెర్ల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూని వర్సిటీలో నిర్వహిస్తున్న మూడు, ఐదేళ్ల న్యాయ కోర్సుకు సంబంధించి సెమిస్టర్ పరీక్షలను వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మంగళవారం పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు, మాల్ ప్రాక్టీస్ లేకుండా చూడాలని ఆమె సూచించారు. ఈ పరీక్షలకు రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య చీఫ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తున్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ మహేష్ అన్నారు. నగరంలోని శివానీ డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కలిగించారు. డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాతపట్నం కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయాలి: ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం కేంద్రంగా కొత్తజిల్లాను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు డిమాండ్ చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో మండల ముఖ్య నేతలతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతపట్నం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటుతో ఈ ప్రాంతానికి పునర్ వైభవం వస్తుందన్నారు. పాతపట్నం పార్లమెంటరీ కేంద్రంగానే వీవీగిరి లాంటి గొప్ప నాయకులు పార్లమెంట్‌లో అడుగుపెట్టారని గుర్తు చేశారు. కాలక్రమంలో గతంలో పాలకుల వైఫల్యంతో రెవెన్యూ డివిజినల్ కేంద్రం పలాసకు, 100పడకల ఆసుపత్రి పాలకొండకు తరలిపోయిందన్నారు. గతంలో టీడీపీ పాలనలో ఏడు మండలాలతో పాతపట్నం రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయాంలో ప్రతిపాదనలు పూర్తయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. ఎన్నికల కారణంగా అది కార్యరూపం దాల్చలేదని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇది బుట్ట దాఖలైందన్నారు. ఒడిశా సరిహద్దులో ఉన్న పాతపట్నంలో జిల్లా కేంద్రం ఏర్పాటుతో ఇరురాష్ట్రాల సరిహద్దు భూసమస్యలు, జల వివాదాలకు సత్వర పరిష్కారం దొరుకుతుందన్నారు. ప్రధానంగా నేరనియంత్రణలో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పలాస జిల్లాలో కలపడంతో పాతపట్నంకు ఒరిగేదేమీ ఉండదని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో హిరమండలం, కొత్తూరు, ఎల్ఎన్‌పేట తదితర మండలాల నాయకులు పాల్గొన్నారు.

వినతి పత్రాలను పరిగణనలోకి తీసుకోవాలి

ఎల్.ఎన్.పేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్.ఎన్.పేట మండలాన్ని శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌కు మార్చాలని మండల ప్రజలు ఇస్తున్న వినతి పత్రాలను పరిగణనలోకి తీసుకోవాలని హిరమండలం ఏఎంసీ డైరెక్టర్ పి.నాగేశ్వరరావు, మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు రామారావులు అన్నారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ జె.ఈశ్వరమ్మకు వినతిపత్రాన్ని ఇచ్చారు. వీరితో పాటు రాంబాబు, రాజేష్, బాలకృష్ణ, రామశంకరరావులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్ మద్యం మత్తులో యువకుడిపై దాడి

- విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన


రాజేష్ (ఫైల్)

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పండ్ల దుకాణంలో పనిచేస్తున్న యువకుడిపై మద్యం మత్తులో సంబంధిత యజమాని స్నేహితుడితో కలిసి దాడి చేసిన ఘటనలో అరసవల్లికి చెందిన ఉల్లాకుల రాజేష్(30) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సంచలనం కలిగించింది. ఈ ఘటన ఆలస్యంగా బయటపడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఉల్లాకుల రాజేష్ పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో పండ్ల దుకాణం నిర్వహిస్తున్న వంశీ వద్ద కొన్నేళ్లుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 3న యజమాని వంశీ రాత్రి దుకాణానికి వచ్చి వ్యాపారం ఎంత జరిగిందని రాజేష్‌ను ప్రశ్నించాడు. రూ.24 వేలు అయిందని చెప్పాడు. అయితే అప్పటికే మద్యం మత్తులో ఉన్న వంశీ రోజువారి ఇచ్చిన ఆదాయం కంటే తక్కువ ఎందుకయిందని కోపోద్రిక్తుడై రాజేష్‌పై దాడిగి దిగాడు. అయితే ఈ రోజు ఆదివారమని, మార్కెట్‌లో వ్యాపారం మందగించిందని, కనుకే రూ.24 వేలే అయిందని చెప్పగా దానికి వంశీ ఆగ్రహం వ్యక్తం చేసి మరోసారి దాడికి పాల్పడ్డాడు. రాజేష్ చేసేదేమీ లేక అక్కడి నుంచి పారిపోయాడు. వంశీ అతని స్నేహితుడైన రామకృష్ణకు ఫోన్ ద్వారా పిలిపించుకొని తన వద్ద పనిచేస్తున్న రాజేష్ మోసం చేశాడంటూ చెప్పాడు. రామకృష్ణ కూడా మార్కెట్ వద్దకు చేరుకొని వారిద్దరు రాజేష్‌కు ఫోన్ చేసి నీవు ఎక్కడున్నావు, మా వద్దకు రాకపోతే నీ ఇంటి వద్దకు వచ్చి గలాటా చేసి నీ భార్యను కూడా వీధిలోకి లాగుతామని బెదిరించారు. దీంతో రాజేష్ తాను అరసవల్లి జంక్షన్ వద్ద ఉన్నానని తెలపగా వంశీ, రామకృష్ణ అక్కడకు చేరుకొని రాజేష్‌ను దుకాణం వద్దకు పిలిచి మద్యం సేవించి మరలా దాడి చేశారు. దాడి అనంతరం వంశీ, రామకృష్ణ ఆటోలో వెళ్లిపోతుండగా రాజేష్ తాను ఏం తప్పు చేశానని, ఇంతలా దాడి చేశారని ప్రశ్నించగా మరలా ఆటోలో ఎక్కించుకొని తీవ్రంగా చితకబాది ఆటో నుంచి నెట్టివేశారు. రాజేష్‌కు తల వెనుకభాగాన తీవ్ర గాయాలయ్యాయి. రాజేష్‌ను అరసవల్లి వద్ద ఉన్న ఇంటి వద్దకు తీసుకువెళ్లి ఆరు బయట వదిలేశారు. ఆదివారం అర్ధరాత్రి ఘటన జరిగినా రాజేష్‌ను కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం వరకు చూడలేదు. ఉదయం అతని భార్య వచ్చి చూసేసరికి మద్యం మత్తులో ఉన్నాడేమోనని ఇంటిలోకి తీసుకెళ్లి పడుకోబెట్టింది. అయితే సాయంత్రమైనా రాజేష్ స్పృహలోకి రాకపోవడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడి రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. బాధితుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం రిమ్స్ వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం రాజేష్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న శ్రీకాకుళం వన్‌టౌన్ ఎస్ఐ హరికృష్ణ. దాడికి పాల్పడిన వంశీ, రామకృష్ణలను 10 రోజుల తరువాత అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఈమేరకు మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీకాకుళం నడిబొడ్డున ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఇటువంటి ఘటన జరగడం వ్యాపార వర్గాలు, ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

గంజాయితో నిందితుడి అరెస్టు


నిందితుడితో పోలీసులు

కొత్తూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మాతల వద్ద సోమవారం సాయంత్రం ఏడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని, మహాలింగం సూర్య అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం కొత్తూరు పోలీసు స్టేషన్‌లో విలేకరుల ఎదుట నిందితుడిని ప్రవేశపెట్టారు. తమిళనాడుకు గంజాయి రవాణా చేసే క్రమంలో ఆమదాలవలసలో రైలు ఎక్కేందుకు సూర్య ఒడిశా నుంచి వస్తుండగా కొత్తూరు పోలీసులు తనిఖీ చేశారని డీఎస్పీ తెలిపారు. అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారని ఆయన తెలిపారు. గంజాయి రవాణాదారుడిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన కొత్తూరు సీఐ సీహెచ్ ప్రసాద్, ఎస్ఐ ఎమ్‌డీ అమీర్ అలీ, సిబ్బందిని అభినందించారు. నిందితుడిది తమిళనాడులోని మధురై ప్రాంతమని తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన కొత్తూరు పోలీసులకు రివార్డు అందజేసేందుకు ఎస్పీకి సిఫారసు చేస్తామన్నారు. సమావేశంలో కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్ పాల్గొన్నారు.

72 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం


వాహనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొత్తూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఒడిశాకు అక్రమంగా తరలిస్తున్న 72 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారి శాంతారావు ఆధ్వర్యంలో మాతల వద్ద పట్టుకొని సీజ్ చేసినట్లు తహసీల్దార్ కె.బాలకృష్ణ తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు వ్యాన్‌లను సీజ్ చేసి 72 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కడుము గ్రామానికి చెందిన ఒక ప్రజా ప్రతినిధి రైస్ మిల్లుకు తీసుకు వెళుతున్నట్లు వ్యాన్ డ్రైవర్ అధికారులకు తెలిపాడు. గతంలో కూడా మన్యం జిల్లాలో భారీ స్థాయిలో పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నది ఇదే రైసుమిల్లుగా అధికారులు గుర్తించారు. ఈ దాడుల్లో డీటీ సీహెచ్ భీమారావు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పొందూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తాడివలస గ్రామానికి చెందిన పూజారి రమణ(60) పాముకాటుతో మృతిచెందాడు. రెండు రోజుల క్రితం పొలంలో గడ్డి కోస్తుండగా రమణ చేతిపై పాము కాటువేసింది. కుటుంబ సభ్యులు తాడివలస పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుఝామున రమణ మృతిచెందారు పొందూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మెళియాపుట్టి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కొసమాల గ్రామానికి చెందిన డోల శేఖర్ అనే యువకుడు మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. మెళియాపుట్టి నుంచి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా.. కొసమాల వద్ద కుక్కలు అడ్డంగా రావటంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే 108 వాహనంలో ద టెక్కలి ఆసుపత్రికి తరలించారు. కాలికి బలమైన గాయాలు కావడంతో శ్రీకాకుళం తరలించి వైద్య సేవలు అందిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగాజాబ్‌మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చి... ఉపాధి అవకాశాలను కల్పిస్తామని తెలిపారు. మెగా ఉద్యోగ మేళాల ద్వారా జిల్లాలో సుమారు 5 వేల మందికి ఉపాధి అవకాశాలను కల్పించినట్టు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 11 ప్రైవేటు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. 331 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా 145 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికైనట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన, కళాశాల డైరెక్టర్లు సిహెచ్ దుర్గాప్రసాద్, పాగోటి రామచంద్రరావు, రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, తహసీల్దార్ సత్యనారాయణ, గొద్దు చిట్టిబాబు, పీస కృష్ణ, ఉణ్న వెంకటేశ్వరరావు, బెవర రాము, కింజరాపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంత అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

హరిపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండలం కొండలోగాం పంచాయితీ పట్టులోగాం గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను ఆమె మంగళవారం సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య వచ్చిన వివాదాల నేపథ్యంలో అన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనాలు అందించేలా చర్యలు తీసుకుంటామని తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్, భావన దుర్యోధన, రట్టి లింగరాజు, సవర లఖియా, ముంజేటి చంద్రశేఖర్, దాసరి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రభుత్వ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. మందస మండలం కొండలోగాం గ్రామంలో మంగళవారం సుపరిపాలనలో ముందడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులకు విద్య, వైద్యం, రోడ్లు, తాగు, సాగు నీరు అన్నింటినీ టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అందించామని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్ల కనీసం గిరిజన నిధులు కేటాయించలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాలిన మాధవరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు సవర కుమారి తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

టెక్కలి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మాదకద్రవ్యాలకు అధికంగా ఆకర్షితులై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. చెడు మార్గాన్ని వీడి మంచివైపు నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ నేతాజీ, వైసీసీబీయూ ట్రక్కర్ ప్రాజెక్ట్ మాధవరావు, హెల్త్ ఎడ్యుకేటర్ హరినాథ్‌రెడ్డి, కౌన్సిలర్ పార్వతి, హేమలత, రెడ్ రిబ్బన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

కాపుతెంబూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. టెక్కలి పోలీస్ సబ్‌డివిజన్ ఇన్‌చార్జ్ గిరిధర్ విద్యార్థులకు యాప్ వినియోగం తదితర అంశాలపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పోలాకి జానకి రామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయాల్లోనే ఓటర్ల జాబితాలు

పలాస, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి ఎన్నికల్లో మున్సిపాలిటీల్లోనే ఓటర్ల జాబితా తయారవుతుందని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. ఈ మేరకు విజయవాడలోని పురపాలకశాఖ డైరెక్టర్, కమిషనర్ కార్యాలయంలో ఓటర్ల జాబితాపై శిక్షణ తరగతులు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కమిషనర్ మాట్లాడుతూ ఫొటో, ఓటరు జాబితాలు మున్సిపల్ కమిషనర్ లాగిన్‌లోనే తయారవుతాయన్నారు. దీనివల్ల ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లవని, ఉన్నా వాటిని సరిచేయడానికి మార్గం సులభతరం అవుతుందన్నారు.

నులిపురుగుల నివారణకు మాత్రల పంపిణీ


నులిపురుగుల ఆకారంలో విద్యార్థినులు

పోలాకి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గంగివలస కేజీబీవీ బాలికల పాఠశాలలో మంగళవారం విద్యార్థినులకు నులి పురుగుల నివారణకు మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలాకి ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి బి.శ్రీనాథ్, విస్తరణాధికారి నల్లి రవికుమార్, కేజీబీవీ ప్రిన్సిపాల్ బి.శారద, పీఈటీ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నులిపురుగల ఆకారంలో కూర్చొని చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది.

మాత్రలతో మేలు...

టెక్కలి రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని టెక్కలి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో మేరికేథరిన్ తెలిపారు. మంగళవారం లింగాలవలస జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. మంగళవారం సుమారు 15 వేల మంది పిల్లలకు పిల్లలు వేయించామని తెలిపారు. మిగిలిన విద్యార్థులకు ఈనెల 20న వేయించనున్నట్టు మేరీ కేథరిన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.కొత్తూరు, లింగాలవలస వైద్యాధికారులు గాయత్రీ పవన్, సూపర్ వైజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరులో...

వజ్రపుకొత్తూరు, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): నులిపురుగల నివారణ మాత్రలతో ఆరోగ్యంగా ఉండవచ్చని నగరపల్లి హైస్కూల్ హెచ్ఎం టి.హేమారావు తెలిపారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వజ్రపుకొత్తూరు పీహెచ్‌సి సీహెచ్‌ఓ ఎస్ ఈశ్వరమ్మ, ఏఎన్ఎం నీలవేణి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్ పేరు మార్చరా?



డీసీసీబీ కార్యాలయంలో ఉన్న బోర్డు

టెక్కలి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): టెక్కలిలో గల జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ శాఖ సిబ్బంది తీరు మారడం లేదు. డీసీసీబీ చైర్మన్‌గా శివ్వాల సూర్యనారాయణను రాష్ట్ర ప్రభుత్వం నియమించి నెలలు గడుస్తున్నా టెక్కలిలోని బ్యాంక్ శాఖలో మాత్రం గ్రీవెన్స్ బోర్డుపై ఇంకా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో డీసీసీబీ చైర్మన్‌గా వ్యవహరించిన కరిమి రాజేశ్వరరావు, సీఈవోగా సత్యనారాయణ బదులు వరప్రసాదరావు పేర్లతోనే బోర్డులు కనిపిస్తున్నాయి. అక్కడికి వెళ్లిన వారంతా ఈ బోర్డు చూసి ఇంతకీ డీసీసీబీ చైర్మన్, సీఈవోలు ఎవరు అనే సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై టెక్కలి డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ పాలక చంద్రరావు వద్ద ప్రస్తావించగా కొత్త చైర్మన్, సీఈవో పేర్లతో బయట బ్యానర్ ఏర్పాటు చేశామన్నారు. బ్యానరులో పేర్లు మార్చినా బ్యాంకు లోపల మాత్రం పాత డీసీసీబీ చైర్మన్, సీఈవోల పేర్లు కొనసాగుతుండడం గమనార్హం.

ప్రభుత్వ విద్యను పరిరక్షించాలి


ఏఐఎస్ఎఫ్ పతాకావిష్కరణలో సంఘ నాయకులు

పలాస, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యను పరిరక్షించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.రవి కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ సభ నిర్వహించారు. సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యాసంస్థల్లోకి విద్యార్థి నాయకులు, రాజకీయ పార్టీలకు అనుమతి లేదని తీసుకువచ్చిన జీవోలు ఎవరి లబ్ధికోసమని ప్రశ్నించారు. ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మెటిక్స్ ఛార్జీలు పెంచాలని కోరారు. విద్యార్థులను ఉన్నత విద్యను దూరం చేసే జీఓ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కె.సాయి, రాహుల్, నాయుడు, కుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టండి

కోటబొమ్మాళి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎక్కువ మంది ప్రజలు వైరల్ జ్వరాల బారిన పడుతున్నారని ఇలాంటి సమయంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని ఎంపీడీవో కుప్పిలి ఫణీంద్రకుమార్ తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించాలని, ఖాళీ స్థలాలు, డ్రైనేజీలలో దోమల నివారణ మందులను పిచికారీ చేయాలని ఆదేశించారు. అనంతరం కార్యదర్శులకు దోమల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జె.ఆనందరావు, కార్యదర్శులు నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

పలాస, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక డిపో కార్యాలయం గేటు వద్ద ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ సెక్రటరీ పి.వాలి, హెచ్‌వి.మూర్తి, ఏవీరావు, ఎన్.అప్పారావు, డి.శ్రీనివాసరావు, ఆచారి, పార్వతీశం, ఏపీఎన్‌జీఓ నాయకులు బోనెల గోపాల్, బి.ఉపేంద్రరావు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కంప్యూటర్ కోడింగ్‌పై పోటీ పరీక్షలు

టెక్కలి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం విద్యార్థులకు నిర్వాహకులు బి.రమేష్, బి.రాజేష్, జి.విజయ్‌కుమార్‌లు కంప్యూటర్ కోడింగ్‌పై మంగళవారం పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో ప్రతిభావంతులకు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావు, డాక్టర్ వై.రమేష్, టి.చలపతిరావు పాల్గొన్నారు.

పాలపోలమ్మకు చల్లదనం


ముర్రాటలతో భక్తులు

జలుమూరు (సారవకోట), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మదనాపురంలో వెలసిన పాలపోలమ్మ తల్లికి గ్రామస్థులు మంగళవారం ముర్రాటలతో చల్లదనం చేశారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం మహిళలు ముర్రాటలు పట్టుకొని మంగళ వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపుగా బయలుదేరి పాల పోలమ్మ తల్లి సన్నిధికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కోనారి సింహాచలం, పిట్ట అప్పారావు, సింహాచలం, పట్నాల రామారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

విద్యార్థులకు పోటీలు

నరసన్నపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆవిర్భవించి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. జిల్లా సంస్కృతి, చరిత్రను ప్రతిబింబించేలా చిత్రలేఖనం, వ్యాచరచన, వక్తృత్వపోటీలన నిర్వహించారు. సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారని ప్రిన్సిపాల్ ఎం.పవన్ తెలిపారు.

పాతపట్నంలో...

పాతపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా వజ్రోత్సవాలలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా మంగళవారం జరిగిన వివిధ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం 20 కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారని ప్రిన్సిపాల్ టి.హేమసుందరరావు తెలిపారు.

పలాసలో...

పలాస, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా వజ్రోత్సవాల సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నియోజవకర్గ స్థాయిలో వివిధ పోటీలు మంగళవారం నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు శ్రీకాకుళంలో బహుమతులు అందిస్తారని ప్రిన్సిపాల్ కె.నర్సింహమూర్తి తెలిపారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

నందిగాం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్‌లో సాగుచేస్తున్న పంటకు సంబంధించి ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్‌వర్మ రైతులకు సూచించారు. మంగళవార పెంటూరులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంటల బీమా పథకానికి సంబంధించి బ్యాంక్ రుణం పొందని రైతులు ఈనెల 15లోగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత ప్రతినిధి బెండి గిరిబాబు, వీఏఏ డి.అరవింద్, రైతులు పాల్గొన్నారు.

రంగనాథన్‌కు ఘన నివాళి

సంతబొమ్మాళి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాల అభివృద్ధికి రంగనాథన్ చేసిన సేవలను గ్రంథాలయాధికారి రామకృష్ణ వివరించారు. ఈ కార్యక్రమంలో నారాయణ, చందు పాల్గొన్నారు.

పలాసలో...

పలాస రూరల్, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల అభివృద్ధికి రంగనాథన్ చేసిన సేవలు మరువలేనివని లైబ్రేరియన్ వై.రాంబాబు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని నిర్వహించారు. విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.